డాక్టర్ రవిరాజు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: ఈనెల 31వ తేదీన పదవీ విరమణ పొందనున్న డిఐఓ డాక్టర్ రవిరాజుకి డిఎంహెచ్ఓ కార్యాలయం తరపున సిబ్బంది సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు నోడల్ అధికారిగా ఉన్న డాక్టర్ రవిరాజు అపూర్వమైన అద్భుతమైన సేవలకు స్మరించుకున్నారు. డిఎంహెచ్ఓ డాక్టర్ రవి రాజు శేష జీవితం ఆరోగ్యంగా ఆనందంగా గడవాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ప్రభావతిదేవి, ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గజ గణన

నాలుగు రాష్ట్రాల్లో ఏనుగుల లెక్కింపు

సాధారణంగా జనాభా లెక్కలు జన గణన చేపడుతుంటారు. అదేవిధంగా పులల సంఖ్య (టైగర్‌సెర్చ్) లెక్కించడం లానే ఏనుగుల గణన చేపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలో ఏనుగుల సంఖ్య గుర్తించేలా దక్షణ భాతర దేశ ఏనుగుల గణన మూడురోజుల పాటు నాలుగు రాష్ట్రాల్లో అటవీశాఖ చేపడుతోంది. ఏనుగులు అనేవి ఒకే చోట ఉండవు... ఆహారం, అవసరాలను బట్టి ప్రాంతాలను మారుస్తుంటాయి. ఆహారం కోసం కొన్ని సందర్భాల్లో జనవాసాల్లోకి వస్తుంటాయి.

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లాలోని గుడిపాల, ఐరాల, పలమనేరు, కుప్పం, రామకుప్పం, బంగారుపాళ్యం ప్రాంతాల్లో ఏనుగుల సంచారం చూశాం. పంట నష్టంతో పాటు ప్రాణనష్టం చోటు చేసుకున్న సందర్భాలున్నాయి. ముఖ్యంగా ఏనుగులు పంట పొలాలపై దాడులు చేస్తున్న సందర్భంగా వాటిని బెదరగొట్టే ప్రయత్నం చేయడం వల్ల మనుషులపై దాడులకు పాల్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటోంది. గత ఏడాది నిర్వహించిన గణన ప్రకారం జిల్లాలో 80 నుంచి 110 వరకు ఏనుగులున్నట్లు అటవీశాఖ అంచనా వేసింది. శేషాచలం అడవుల్లో 30 ఏనుగుల వరకు ఉన్నట్లు అంచనా. కాగా ఈ సంవత్సరం వలస వచ్చిన ఏనుగులతో కలిసి సంఖ్య పెరిగే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

ఏనుగుల లెక్కింపు ఇలా...

మొదటి దశలో ఏనుగుల నేరుగా చూసి ఫోటోలు తీస్తూ లెక్కిస్తారు. రెండవ దశలో ఏనుగుల ఆనవాళ్ళను బట్టి ఎన్ని ఉంటాయనే అంచనా వేస్తారు. మూడో దశలో ఉదయం ఆరు గంటల నుండీ సాయంత్రం ఆరు గంటల వరకు అటవీప్రాంతంలో నిరీక్షించి ఏనుగులను సంఖ్యను గుర్తిస్తారు. ఈ మూడు దశలను సాంకేతికంగా లెక్కించి సంఖ్యను గురిస్తారు. బెంగుళూరు, కర్నాటక అటవీశాఖ ఈ ఆపరేషన్ నిర్వహిస్తోంది. ఏనుగులకు 250 నుంచి 300 కేజీల ఆహారం అవసరం. దీంతో ఆహార లభ్యత, నీరు అందుబాటులో ఉండే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. కావేరి పరివాహక ప్రాంతాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంటోంది.

జిల్లాలో కుప్పం, పలమనేరు ప్రాంతాలకు పరిమితమైన ఏనుగులు ఆహార కొతర కారణంగా ఐరాల, గుడిపాల, బంగారుపాళ్యం, రొంపిచర్ల అటవీ సమీప ప్రాంతాలకు వస్తున్నాయి. గతేడి ఏనుగుల వలన కోటి 18 లక్షల రూపాయల పంట నష్టం రావడంతో ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించారు. 100 వరకు ఎలిఫెన్ట్స్ ట్యాకర్స్ అటవీశాఖ ఏర్పాటు చేసింది. ఏనుగుల సంచారాన్ని గుర్తించి ఆ పరిసర ప్రాంతాల్లోనే ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఏనుగులు ఆహారం కోసం పంట పొలాల్లోకి వస్తుంటాయి. వాటిని బెదరగొట్టడం, పెద్దపెద్ద శబ్దాలు చేయడం వంటివి చేయకూడదు. ఏనుగులు వచ్చాయని తెలిసిన వెంటనే అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకుపోవడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం చోటు చేసుకోకుండా వాటిని తిరిగి అడవుల్లోకి పంపే అవకాశం ఉంటుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

ఏనుగుల్ని బెదరగొట్టే ప్రయత్నం చేయొద్దు

- చైతన్య కుమార్‌రెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి

ఏనుగులు ఆహారం కోసం పంట పొలాలపై దాడులు చేస్తుంటాయి. అటవీ ప్రాంతంలో ఆహారం, నీరు కొరతగా ఉన్న సమయాల్లో ఇవి అటవీసమీప ప్రాంతాల్లోకి వస్తుంటాయి. భారీ శబ్దాలు చేయడం, బెదరగొట్టే ప్రయత్నం చేయరాదు. అటవీశాఖ ఏనుగుల దాడుల నుండీ ఎలాంటి ప్రాణనష్టం వాట్లికుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటోంది. అడవుల చుట్టూ కందకాలు ఏర్పాటు చేసేందుకు కొన్ని ప్రాంతాల్లో కొండలు, గుట్టలు ఇబ్బందిగా మారుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో సోలార్ ఫిన్సింగ్ ఏర్పాటు చేస్తున్నాం. గతే ఏడాది జిల్లాలో కోటి 18లక్షలు రైతులు ఏనుగుల దాడుల్లో పంట నష్టపోయిన్నట్లు అంచనా వేసి ప్రభుత్వానికి పంపడం జరిగింది. ఆ మేరకు పంట నష్టపరిహారం చెల్లించాము.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

రాష్ట్ర హక్కులపై మాట్లాడేవారేరి..?

జూన్‌లో పింఛన్ల పడిగాపులు లేకుండా చూడాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు రాష్ట్రాల హక్కుల కోసం లౌకికవాదాన్ని దృష్టిలో ఉంచుకుని టిడిపిని స్థాపించారని, అయితే ప్రస్తుతం రాష్ట్రాల హక్కుల కోసం టిడిపిలోనూ, వైసిపిలోనూ మాట్లాడేవారే లేరన్నారు. ఎన్టీఆర్‌కు పూలమాలలు వేస్తున్న నాయకులు, ఆయన ఆశయాలను తుంగలో తొక్కారన్నారు. దారితప్పిన టిడిపిని ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులే తిరిగి గాడిలో పెట్టాలన్నారు. ఎన్టీఆర్, నెహ్రూ, కందుకూరిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తిరుపతి సిపిఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత 15 రోజులుగా ప్రధాని మోడీ ఉపన్యాసాలు వింటే దేశభవిష్యత్ ఏమవుతుందోనని భయం వేస్తుందన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఎత్తేస్తామని చెబుతున్న మోడి, దేశంలో వెనుకబాటు, పేదరికాన్ని దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్లు ఏర్పాటు చేశారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ముస్లింలకు సైతం వెనుకుబాటుతనంతో రిజర్వేషన్లు ఇచ్చారని, మత రిజర్వేషన్లు రద్దు చేస్తే హిందువులకూ రిజర్వేషన్లు ఉండవన్నారు. ఈ విషయం బిజెపి కార్యకర్తలకూ తెలుసన్నారు. జూన్ నెలలో పింఛన్ల కోసం పడిగాపులు పడేలా చేస్తే క్షమించరాని తప్పిదం అవుతుందని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు జరిగే చోట హృదయ విదారక ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కూలీలు ఎండతీవ్రత తట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారని, చంటిపిల్లలను సైతం ఎండల్లోనే ఉంచి పనులు చేసుకోవడం బాధాకరమన్నారు. రోజంతా కష్టపడినా కూలీలకు రూ.200 కూలి దక్కడం లేదన్నారు. ఉపాధి కూలీలకు కనీస కూలి రూ.400, వైద్య సౌకర్యాలు, పనిచేసే చోట కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసకు టిడిపి, వైసిపి రెండు పార్టీలు ప్రధాన కారణమన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. మోడీ చెప్పినట్లు ఈసీ ఆడుతుందన్నారు. ఎన్నికల్లో డబ్బులు పంచకుండా, ప్రజా మద్దతు కోరిన ఏకైక పార్టీ సిపిఎం అని స్పష్టం చేశారు. రాబోవు రోజుల్లో ఎవ్వరూ అధికారంలో ఉన్న బెయిల్‌పై ఉన్న ముఖ్యమంత్రులేనని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపుపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షణ్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సార్వత్రిక ఎన్నికలు-2024 ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఓట్ల లెక్కింపులో ఎటువంటి తప్పిదాలకు తావు లేకుండా సమిష్టిగా బాధ్యతతో పనిచేసి విజయ వంతం చేద్దామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షణ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాపరిషత్ సమావేశపు మందిరంలో సార్వత్రిక ఎన్నికలు - 2024లో భాగంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియపై పర్యవేక్షకులు, కౌంటింగ్ సహాయకులు, సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్, 172-చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు- 2024కు సంబంధించి జూన్4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎస్‌వి.సెట్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే కౌంటింగ్ పర్యవేక్షకులు, కౌంటింగ్ సహాయకులు, సూక్ష్మ పరిశీలకులు ఈ అంశంపై పూర్తి అవగాహన పొందాలన్నారు. తద్వారా సజావుగా ఓట్లలెక్కింపు ప్రక్రియను పూర్తి చేయవచ్చునని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఉన్న హ్యాండ్ బుక్‌ను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది సానుకూల ధక్పథంతో పనిచేస్తూ ప్రశాంతంగా వారి విధులను నిర్వర్తించాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది కౌంటింగ్ రోజున నిర్దేశించిన సమయంలోపు రిపోర్ట్ చేయవలసి ఉంటుందన్నారు. కౌంటింగ్ హాల్‌లోకి ఫోన్‌ల అనుమతి లేదని తెలిపారు. ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రతి ఆర్ఓ వారి నియోజకవర్గపు ఓట్ల లెక్కింపుకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి జూన్ 3న పరిశీలకుల సమక్షంలో రెండవ విడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, కౌంటింగ్ రోజున కౌంటింగ్ విధులకు సంబంధించి 3వ ర్యాండమైజేషన్ ఉదయం పరిశీలకుల సమక్షంలో జరిగిన అనంతరం కౌంటింగ్ విధులను కేటాయించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఈవిఎంలలో ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే భెల్ ఇంజనీర్ల దష్టికి తీసుకురావాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు సంబంధించి ఎన్నికల సంఘం తాజా ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఈవిఎంల ఓట్ల లెక్కింపులో ఏజెంట్లు ఎటువంటి సందేహాలు వ్యక్తం చేసినా రిటర్నింగ్ అధికారి దష్టికి తీసుకువెళ్లాలని, ఎటువంటి కంగారు పడకుండా ప్రశాంతంగా ఎన్నికల నియమ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్ విఆర్ చంద్రమౌళి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ప్రతి అంశాన్ని కూలంకుషంగా వివరిస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ బి.పుల్లయ్య, పుంగనూరు, నగరి, జి.డి నెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం, మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకట శివ, చిన్నయ్య, మనోజ్ రెడ్డి, శ్రీనివాసులు, ఏఆర్ఓలు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సగిలి షన్మోహన్

అసాంఘిక శక్తులను ఎదుర్కొనేందుకే మాక్ డ్రిల్ : ఎస్పీ

గాంధీ సర్కిల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎవరైనా చట్టవిరుద్ధమైన సమావేశాలు ఏర్పాటు చేస్తే వారిని పోలీసు శాఖ ఎలా ఎదుర్కుంటుంది అనే దానిపై మంగళవారం చిత్తూరు పట్టణంలో మాక్‌డ్రిల్ నిర్వహణతో తెలిజేశామని జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిపించాలానే ఉద్దేశంతో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద పోలీసులు జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే ఎంతటివారైన ఉపేక్షించేది లేదని, వారి పైన కఠినమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు, సంఘ విద్రోహచర్యలకు ప్రజలు పాల్పడవద్దని సూచించారు. ఎన్నికల ఫలితాలు అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహణకు అనుమతులు లేవని శాంతియుతంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీ వ్యక్తులు జిల్లా పోలీసులు యంత్రంగానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ.ఆర్ జి.నాగేశ్వర రావు, చిత్తూరు సబ్ డివిజన్ డిఎస్పీ రాజగోపాల్ రెడ్డి, చిత్తూరు 1వ పట్టణ ఇన్స్పెక్టర్ విశ్వనాథ రెడ్డి, 2వ పట్టణ ఇన్స్పెక్టర్ ఉలసయ్య, ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుల్లయప్ప, వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేవదేవుని బ్రహ్మోత్సవాలు

అంకురార్పణతో ప్రారంభం

14 ఎకారల్లోని అతి పెద్ద స్కంధపుష్కరిణి

ఆకట్టుకునే ఏక ధ్వజస్తంభం

ప్రజాశక్తి వెదురు కుప్పం/ కార్వేటినగరం:

కార్వేటినగరంలోని ప్రసిద్ధి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 29వ తేదీ నుంచి దేవదేవుని వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో స్వామివారు రోజుకో అవతారంలో వివిధ వాహనాలపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. మే 28వ తేదీ మంగళవారం సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు.

పురవీధులలో వాహన సేవలో ఇలా...

29న బుధవారం 10.30 నుంచి 11గంటల మధ్య కర్కాటక లగ్నమందు ధ్వజారోహణం, రాత్రికి పెద్ద శేషవాహనం, 30న చిన్నశేష వాహనం, రాత్రికి స్వామివారు వీణాపాణై హంసవాహనంపై ఊరేగుతారు. 31న ఉదయం సింహ వాహనం, రాత్రికి ముత్యపుపందిరి, జూన్ 1న కల్పవక్షవాహనం, ఆర్జిత కళ్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం, 2న ఉదయం మోహినీ అవతారం, రాత్రికి గరుడ సేవ, 3న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం గజవాహనం, 4న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలు, 5న రథోత్సవం, రాత్రి అశ్వవాహనం. 6న ఉదయం పల్లకిసేవ, చక్రస్నానం, సాయంత్రం ధ్వజాఅవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

అతిపెద్ద స్కంధ పుష్కరిణి

14 ఎకరాల అతిపెద్ద స్కంధపుష్కరిణి దక్షిణ భారతదేశంలోని ఒక అద్భుత కట్టడమని చరిత్ర చెబుతుంది. 19వ శతాబ్దాంలో కరువు నుంచి ప్రజలకు కాపాడటానికి, వారి దాహార్తిని తీర్చడానికి అప్పటి కార్వేటినగరం సంస్థానాధీశుడైన వెంకటపెరుమాళ్ రాజు 14ఎకరాల విస్తీర్ణంలో స్కంధ పుష్కరిణిని తవ్వించి నిర్మించారు. కూలీలకు స్వయంగా మహారాజే ధనాన్ని దోసిళ్లతో నాణ్యాలను కూలిగా ఇచ్చేరని చెబుతారు. దక్షిణాసియాలోనే ఎక్కడా ఇలాంటి పుష్కరిణి లేదు. ఈ పుష్కరిణి మెట్లపై నాటి శిల్పకళ (దేవతామూర్తులు, సర్పాలు, శంగార శిల్పాలు)ను చూడవచ్చు, నీటిమట్టం నాలుగు వైపులా ఏ వైపు చూసినా సమాతంరంగా ఉండటం నాటి శిల్పుల గొప్పతనానికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఏటా శ్రీవేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చక్రస్నానాన్ని, తెప్పోత్సావాలను పుష్కరిణిలో వైభవంగా నిర్వహిస్తారు. అలాగే పుష్కరిణి సమీపంలో వెలసిన శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయ తెప్పోత్సవాలు కూడా ఈ పుష్కరిణిలో ఏటా వేడుకగా నిర్వహిస్తారు ఈ ఆలయ ప్రత్యేకత తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారితో పూజలందుకొంటున్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవతామూర్తులను ఇక్కడికి తెప్పించి వైఖానసులచే ప్రతిష్టించినట్లు చరిత్ర చెబుతున్న పురాణ కథనం..

కాయలు కానరాక.. కన్నీరు ఆగక..

- మామిడి రైతుల వేదన వర్ణణాతీతం
- నకిలీ మందులతో తగ్గిన దిగుబడి

పజాశక్తి -ఎస్ఆర్‌పురం

రైతులను ఆదుకోవాలన్న సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వ పథకంలో రైతులకు మామిడి చెట్లు మంజూరు చేసి వేలాది మంది రైతులు మామిడి రైతులుగా ప్రభుత్వాలు తీర్చిదిద్దాయి. అయితే ప్రతి ఏడాది కాపు ఉన్నా సరైన గిట్టుబాటు ధరలేక దళారుల చేత నష్టపోయే వారు మామిడి రైతులు. అయితే ఈ ఏడాది అసలు చెట్లకు పూతే నిలబడలేదు.. ఉన్న కొద్దిపాటు కాయలు తెగులు, వాతారవణ పరిస్థితులు వలన రాయిపోయాయి. ఈ ఏడాది అయినా పంట బాగుంటుందని, సరైన దిగుబడికి గిట్టుబాటు ధర ఉంటుందని ఆశపడి రైతులకు నిరాశే మిగిలింది. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి పండించిన పంట కాస్తా ఏమీ లేకపోవడంతో రైతుల అప్పులపాలవ్వక తప్పలేదు..

నకిలీ మందులతో నష్టం

- బుజ్జి బాబు, కటికపల్లి గ్రామం



మామిడి చెట్ల సంరక్షణ కొరకు మార్కెట్‌లో క్రిమిసంహారక మందులు అమ్మే దుకాణాలలో ఏది నకిలీ మందు.. ఏది ఒరిజినల్.. అని సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహిస్తే రైతులకు ఒరిజినల్ క్రిమిసంహారక మందులు లభిస్తాయి. ఏ మందు ఏదో తెలీని రైతులు నకిలీ మందులకు కొని పంటలకు వేయడం వలన కాయలేకపోగా చెట్లు కూడా చచ్చిపోతున్నాయి. ఆయా సీజన్లలో సంబంధిత అధికారులు రైతులకి మామిడి చెట్టుకు వచ్చే రోగాలు వాటి సంరక్షణకు వాడాల్సి క్రిమిసంహారక మందుల వాడకంపై అవగాహన కల్పించారు. లేకుంటే రైతులకు నష్టం తప్పదు.

ధర ఉన్నా.. దిగుబడి లేదు..

- సుధాకర్ పిళ్లై, 49 కొత్తపల్లి మిట్ట



నాకు నాలుగు ఎకరాల మామిడి తోట ఉంది. ఈ సంవత్సరం మామిడిచెట్లకు పూత అంతంత మాత్రం.. ఇక కాయలు అసలే లేవు. దీంతో అప్పులు చేసిన పెట్టిన పెట్టుబడి బూడిదపాలైంది. గత సంవత్సరం నవంబర్ నుంచే పంటకు తీసుకోవల్సిన సస్యరక్షణ తీసుకున్నాను. అన్ని రకాల మందులు పిచికారీ చేశారు. అయినా పంట దిగుబడి లేదు.. ప్రసుత్తం మార్కెట్‌లో మామిడికి బాగా ధర ఉంది. కానీ దిగుబడి లేకపోవడంతో రైతులకు నష్టం తప్పడం లేదు.

మామిడి తోటలకు కాపాలా ఉంటున్నాం..

- మోహన్ నాయుడు, మాజీ సర్పంచ్ ఎస్ఆర్ పురం



వాతావరణ మార్పులు, క్రిమిసంహారక మందుల వలనో తెలీదు కానీ ఈ సారి మామిడి చెట్టులో పూత లేక కాపు రాక ఇబ్బందులు పడ్డాం. అక్కడక్కడా ఓ చెట్లలో అంతంత మాత్రాన ఉన్న కాయలను కూడా కొందరు తోటలోకి వచ్చి దొంగతనంగా తీసుకెళ్తున్నారు. దీంతో తోటలకు కాపాలా ఉండాల్సి వచ్చింది. సంబంధిత అధికారులు ర్యాంపుల వద్ద రిజిస్టర్ మైంటైన్ చేసి రైతు వివరాలు సేకరిస్తే ఇలాంటి దొంగతనాలను కొద్దివరకు అరికట్టవచ్చు.

మచ్చలతో తగ్గిన ధర

- ఆదిశయ రాజు, కొత్తపల్లి మిట్ట

పంట కోత సమయానికి జిగురు వచ్చి కాయలు మచ్చలు కావడం, పండు ఈగలు కాడ చుట్టూ గిర్రలు గీయటం, కాయలు రాలిపోయి మచ్చలు పడటంతో అటువంటి కాయలకు ధర తగ్గింది. ప్రస్తుతం మార్కెట్‌లో ధర ఉన్నప్పటికీ ఇటువంటి కాయలకు సగధరే వస్తోంది. ఈసారి మామిడి కాయలకు ధర బాగా ఉన్నా.. కాపు లేకపోవడం, తెగుళ్లు, మచ్చలతో సరైన గిట్టుబాటు దొరకలేదు.

అప్రమత్తంగా ఉండండి : ఏఈ

ప్రజాశక్తి -సదుం: మండల పరిధిలో గతకొంత కాలంగా రాత్రి సమయంలో పంట పొలాలపై ఏనుగుల సంచరిస్తున్న సందర్భంగా ఏనుగుల విద్యుత్ వైర్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు తగులుకొని చనిపోయిన సంఘటనలు చోటు చేసుకొంటున్నాయి. గత ఆదివారం రాత్రి, సోమవారం, మంగళవారం కూడా తాటిగుంటపాళ్యెం, గొడ్డవారిపల్లి, యర్రాతివారిపల్లి, బూరగమంద, చీకలచేను, చెరుకువారిపల్లి, జోగివారిపల్లి పరసర ప్రాంతాలలో ఏనుగుల గుంపు ఎక్కువగా రాత్రి సమయాలలో పంట పొలాలలో సంచరిస్తున్నట్లు సమాచారం ఉన్నందున రైతులు ఏనుగుల కదలికలపై కింది ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సదుం విద్యుత్ ఏఈ ఇలాహీ తెలిపారు. 94906 11610, 94404 69137, 95023 19312 నెంబర్లకు ఫోన్ చేసి ఏనుగుల కదలికలపై సమాచారం ఇవ్వాలని ఆయన రైతులను కోరారు.

ప్రత్యేక ప్రతిభావంతుల సర్వే

ప్రజాశక్తి - సోమల: మండలంలోని ప్రత్యేక ప్రతిభావంతులు, దివ్యాంగుల సర్వేను జూన్ నెల 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చిత్తూరు ఏపీసీ వెంకట రమణ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారులైన శ్రీరాములు శివ రత్నమ్మ ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లల సర్వే నిర్వహించారు. మండలంలో ఎంతమంది దివ్యాంగులు ఉన్నారు, ప్రత్యేక ప్రతిభావంతులు ఉన్నారన్న లెక్కలు తేల్చి సంబంధిత చిన్నారులకు ప్రత్యేక అవసరాలను సమకూర్చేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఇరికిపెంట, వడ్డిపల్లి, ఎస్.నడింపల్లి పంచాయతీలలో ఇప్పటివరకు సర్వే చేయడం జరిగిందని ఐఈ ఆర్టీ ఉద్యోగులు రవీంద్ర, గంగాధర తెలిపారు.

ఎస్ఆర్ పురం: దివ్యాంగులని గుర్తించాలని ఉద్దేశంతో రాష్ట్ర దివ్యాంగుల కమిషనర్ పిలుపు మేరకు, జిల్లా అధికారుల ఆదేశాలతో ఐఆర్టీల సహకారంతో మే 1వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు ఐఈఆర్టీలు చరణ్ తేజ్, అరుణాలు తెలిపారు. మంగళవారం మండలంలోని ఎస్ఆర్ పురం గ్రామపంచాయతీ పాతపాళ్యం గ్రామంలో సర్వేను నిర్వహించి ఇద్దరు పిల్లను గుర్తించారు. అలాగే బంగారుపాళ్యంలో ఐఆర్పి ఉపాధ్యాయులు హిమబిందు దివ్యాంగుల గుర్తింపు సర్వే నిర్వహించారు.

కార్యకర్తలు ఓర్పును పాటించండి

జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - వికోట: మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు ఓపిక పాటించి నాలుగో తేదీ జరిగే కౌంటింగ్‌లో పాల్గొనాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం కల్యాణ మండపంలో పలమనేరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటే గౌడతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే మళ్లీ పునరావృతం కానున్నాయని, పలమనేరు నియోజకవర్గంలో ముచ్చటగా మూడోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని అన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ కోసం నిరంతరం కష్టపడిన ప్రతికర్తకీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో జిల్లాలో 144వ పోలీస్ సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రతికార్యకర్త ఈ విషయాన్ని గుర్తించి ఓపిక పాటించాలని వక్తలు కార్యకర్తలకు హితవుపలికారు.

దాతల సహకారంతో అన్నదాన సత్రం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: కార్వేటినగరం మహారాజావారి ఇలవేల్పు ఆరిమాకుల పల్లిలో వెలసిన శ్రీఆరిమాను గంగమ్మ ఆలయ ఆవరణలో అమ్మవారి భక్తుల సౌకర్యం కోసం అన్నదాన సత్రం పనులు వేగవంతం చేశారు. ఐదు సంవత్సరాల క్రితం కోలారికి చెందిన ఒక భక్తుడు అన్నదాన సత్రం గోడలు పూర్తి చేశారు. అయితే కొన్ని కారణాల వలన పనులు అపేశారు. ఐదేళ్ల తరువాత కాపురం గ్రామానికి చెందిన ప్రేమ్, అతని కుటుంబ సభ్యులు మురళి, జ్యోతి, చందు, ఎత్తురాజుల నాయుడు సహకారంతో ఈ పనులను మళ్లీ ప్రారంభించారు. దాదాపు మూడు నెలల లోపే పనులు పూర్తి చేస్తామని, దాదాపు 1500 మంది భక్తులకు వంటశాల, డైనింగ్ హాల్‌ను నిర్మిస్తామని దాత ప్రేమ్ తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: 'ప్రపంచ బహిష్టు పరిశుభ్రత దినోత్సవం' సందర్భంగా మంగళవారం జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ బహిష్టు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహార ప్రాధాన్యత తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే 'విభిన్న ప్రతిభావంతుల సౌకర్యార్థం, వారి సామర్థ్య వికాసానికి' ఒమేగా రీహాబిలిటేషన్, ఫెడరేషన్ సంస్థ ద్వారా సులభ జీవనశైలికి అవసరమైన పరికరాలను ఇచ్చారు. మొత్తం 23మంది పిల్లలకు విభిన్న రకాల పరికరాలను స్పెషల్ కుర్చీలు, వీల్ చైర్స్, సిపి చైర్, సిపి కార్నర్ చైర్, వివిధ ఆర్థోటిక్ ఐటమ్స్‌ను అందించడం జరిగింది. ఒమేగా ఫెడరేషన్ ప్రెసిడెంట్ దినేష్, డీఈఐసి సిబ్బంది, విజయలక్ష్మి ఫిజియోథెరపిస్ట్ పాల్గొన్నారు.

సోమల: మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించి పౌష్టికాహారాన్ని తీసుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండాలని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రపంచ నెలసరి పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కేంద్రం పరిధిలోని తుగువారిపల్లి, పొదలకుంటపల్లె గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి మహిళలకు అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈఓ అమర్నాథ్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సదుం: చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ గిరీష ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ నెలసరి పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరీష మహిళలకు నెలసరి సమయంలో పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

స్వచ్ఛమైన జ్యూస్‌పై అవగాహన

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

బెంగుళూరు నగరంలోని హోటల్ ఐటిసి వెల్కమ్‌లో రెండు రోజుల పాటు ప్రపంచదేశాల ప్రతినిధులు పాల్గొన్న సెమినార్‌లో ప్రజలకు నేచురల్ జ్యూస్ ఉత్పత్తిపై జ్యూస్ పరిశ్రమలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్వహించారు. ఈసెమినార్‌ను ఇంటర్నేషనల్ ఫ్రూట్ అండ్ వెజిటబుల్ జ్యూస్ అసోసియేషన్ (ఐఎఫ్‌యు) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసెమినార్‌కు చిత్తూరు జిల్లా నుండి దక్షిణ భారతదేశ ఫ్రూట్ ప్రాసెసింగ్ అసోసియేషన్ చైర్మన్ కమ్మదనం బాబి, చిత్తూరు వంద్ర పరిశ్రమ అసోసియేషన్ నుంచి శివకుమార్, తలపల్లి బాబురెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, అమర్నాథ్, పాల్గొన్నారు. 30మంది విదేశీ ప్రతినిధులు, 120 మంది భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. నేచురల్ జ్యూస్ ఎక్కువ ఉత్పత్తి చేసి దీనివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా గుజ్జు పరిశ్రమలు, జ్యూస్ పరిశ్రమలను అభివృద్ధి చేయడం, రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా కృషి చేయాలని సెమినార్‌లో పాల్గొన్న ప్రతినిధులు నిర్ణయించారు. ఈ సెమినార్‌లో ముఖ్యఅతిథిగా ఎపిఈడిఏ చైర్మన్ అభిషేక్ దేవ్, ఎఐఎఫ్‌పిఏ చైర్మన్ రాఘవ జడ్డి పాల్గొన్నారు.

తిరుమలకు ప్రకృతి వ్యవసాయ బెల్లం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం

తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదం తయారీ కోసం ప్రకృతి వ్యవసాయంలో పండించిన చెరకుతో తయారుచేసిన బెల్లాన్ని రైతుల దగ్గర నుండి సేకరించి తిరుమలకి తరలించడం జరిగిందని చిత్తూరు డిపిఎం వాసు అన్నారు. మంగళవారం ఎస్ఆర్ పురం మండలంలోని మంగుంట గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ రైతులు గత నాలుగు సంవత్సరాలుగా వారి సొంత పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన చెరకుతో తయారుచేసిన బెల్లాన్ని ఆర్వైఎస్ డిపిఎం వాసు మార్కెటింగ్ డియం.రమేష్ సహకారంతో రాష్ట్రస్థాయి మార్కెటింగ్ ఎన్ఎఫ్ఎ పర్యవేక్షణలో ఆర్బికే సిబ్బంది భరత్ ఆధ్వర్యంలో 4.5 టన్నుల బెల్లాన్ని మంగళవారం తిరుమలకు తరలించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డిపిఎం వాసు, మార్కెటింగ్ రమేష్, రైతులు శేషాద్రి రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌టిఆర్'కు ఘన నివాళి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మరపురాని జ్ఞాపకం - తెలుగు జాతి గౌరవం నందమూరి తారక రామారావు 101వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్ నేతృత్వంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఘనంగా నివాళ్ళు అర్పించారు. సిఆర్ రాజన్ మాట్లాడుతూ ఆధునిక యువతకు ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రదాత అన్నారు. ఆ మహానేత స్ఫూర్తితో తామంతా సమాజ సేవకు అంకితం అవుతామని ఈ సందర్భంగా టిడిపి ఎంపి అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు తనయుడు, రాధేయ్ కన్స్ట్రక్షన్స్ అధినేత రాధేయ్ కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే మనోహర్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వి.సురేంద్ర కుమార్, మాజీ మేయర్ కటారి హేమలత, చంద్ర ప్రకాష్, కోదండ యాదవ్, మోహన్ రాజ్, శ్రీధర్ యాదవ్, శంకర్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ ఘాట్‌లో రామారావుకు చిత్తూరు టిడిపి ఎంపీ అభ్యర్థి ప్రసాద రావు ఘన నివాళ్ళు అర్పించారు.

సోమల: మండలంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు కందూరు, పెద్ద ఉప్పరపల్లి, నంజంపేట. సోమల ప్రాంతాలలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ సర్పంచులు హరిప్రసాద్ నాయుడు, రెడ్డమ్మ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం మండలంలో టిడిపి మండలాధ్యక్షులు జయప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జనార్థన్ గౌడ్, నాయకులు నాగరాజు నాయుడు, హేమచంద్ర నాయుడు, మహేంద్ర, కోకా ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నందమూరి తారకరామారావు 101వ జయంతి వేడుకలు మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ తమ్ముడు నిధి, సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మోహన్ మురళి, ప్రధాన కార్యదర్శి నరసింహా యాదవ్, చంగల్రాయరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నందమూరి తారక రామారావు 101వ జయంతి మండలం అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భాస్కర్ నాయుడు, సిద్దయ్య శెట్టి, సూరిరెడ్డి, బాలాజీ నాయుడు, మోహన్ నాయుడు, గుండయ్య, నిరంజన్ రెడ్డి, హేమాద్రి యాదవ్ పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలు మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

గంగవరం: మండలంలో నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ సోమశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా కార్వేటినగరం టిడిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. పార్టీ మండల అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, మండల కార్యదర్శి రాజేంద్ర రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వరరాజు, బీసీ సంఘం అధ్యక్షులు రవి యాదవ్ పాల్గొన్నారు.

రామకుప్పం: మంగళవారం రామకుప్పంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకలు నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణాచారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నేతలు సీతాపతి, ఆంజనేయ రెడ్డి, కష్ణనాయక్, చిన్నికష్ణ, చలపతి, నందారెడ్డి, రామ్మూర్తి, సుబ్రీ, విజయ్ రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు బాగున్నాయి..

జాతీయ మానవ హక్కుల ప్రత్యేక పర్యవేక్షకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఆంధ్రప్రదేశ్‌లో ఆసుపత్రుల పనితీరు బాగుందని జాతీయ మానవ హక్కుల కమీషన్ ప్రత్యేక పర్యవేక్షకులు బాలకష్ణ గోయల్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక పర్యవేక్షకులు చిత్తూరు ఆసుపత్రిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు, క్రింది స్థాయి ఉద్యోగులతో సమావేశం అయ్యారు. బాలకష్ణ గోయల్ మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి అపోలో, ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించ బడుతోందని అన్నారు. ఫిర్యాదులకు సంబంధించి కంప్లైంట్ బాక్స్‌లను ఉంచి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈసందర్భంగా పలువురు పేషెంట్లకు సంబంధించిన బంధువులను ఏర్పాట్లు వైద్యసౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ మానవహక్కుల సంఘం వివిధ రాష్ట్రాలలో పర్యటించడం జరిగిందని, చిత్తూరు జిల్లాలో పలు కార్యాలయాలు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేయడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నడుస్తున్నందున సంయుక్తంగా కలిసి పనిచేసి ఆసుపత్రికి వచ్చేవారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ఈసందర్భంగా చిత్తూరు ఆసుపత్రిలో అపోలో యాజమాన్యం వారు ఏర్పాటు చేసిన వివిధ వసతులు గురించి ప్రశ్నించారు. వాతావరణ కాలుష్యం లేకుండా ప్రశాంతమైన వాతావరణం రోగులకు ఉండేలా చూడాలని బయోవేస్ట్ డిస్పోస్ చేసే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. పేషెంట్‌లకు అందించే ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆహారం అందించే ప్రక్రియను పరిశీలించేందుకు ప్రత్యేకనోడల్ అధికారిని నియమించాలని అన్నారు. కంప్లైంట్ బాక్స్, మంచినీరు, టాయిలెట్లను మెరుగుపరచడం వంటి ప్రక్రియల మీద దష్టి పెట్టాలన్నారు. చిన్నపిల్లల వార్డులలో అందిస్తున్న వైద్యసేవలు, ఐసీయూలో ఉన్న ఏర్పాట్లుతో పాటు ఇతర వసతులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. జిల్లా ప్రధాన ఆసుపత్రి పరిశీలనకు ముందుగా సంజయ్ గాంధీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్న పిల్లలకు అందుతున్న ఆహారం, శిక్షణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈపర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డిడి సోషల్ వెల్ఫేర్ రాజ్యలక్ష్మి, డిడి బీసీ వెల్ఫేర్ రబ్బానీ బాష, డిసిహెచ్ ఎస్.రాజశేఖర్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్, అపోలో ఆసుపత్రి ఇన్చార్జ్ నరేష్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న బాలకృష్ణ గోయల్

చిత్తూరు అసెంబ్లీ 14 టేబుల్స్ కౌంటింగ్

ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్స్ కు అనుమతి లేదు : జెసి

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : కౌంటింగ్ ఏజెంట్ల, అభ్యర్థుల సమక్షంలో ఓట్లు లెక్కింపు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్, 172 చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ జెసి సమావేశం హాల్ నందు ఏఆర్ఓ శ్రీనివాసులు రెడ్డితో కలిసి చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జూన్ 4న ఓట్లు లెక్కింపు కార్యక్రమానికి సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యర్థులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మే 13న ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడం జరిగిందని, అదే తరహాలో ఓట్లు లెక్కింపు కార్యక్రమాన్ని కూడా ప్రశాంతంగా విజయవంతంగా నిర్వహించడానికి కౌంటింగ్ ఏజెంట్లు అభ్యర్థులు సహకరించాలన్నారు. నియోజకవర్గానికి సంబంధించి ఓట్లు లెక్కింపునకు 14 టేబుల్స్‌ను, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు మూడు టేబుల్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి టేబుల్‌కు ఒక ఏజెంటు చొప్పున 14 టేబుల్ లకు 14 మంది కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు జూన్ 4న ఉదయం 6 గంటల కల్లా ఎస్‌వి సెట్ కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. 8 గంటల కల్లా పోస్టల్ బ్యాలెట్స్, ఈవీఎంల ద్వారా ఓట్లు లెక్కింపు ప్రక్రియను ప్రారంభించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్స్‌కు అనుమతి లేదని, సెల్ ఫోన్స్‌కు సంబంధించి గేటు వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుంది కాబట్టి సెల్ ఫోన్స్‌ను కౌంటర్‌లో పెట్టాలన్నారు. కంట్రోల్ యూనిట్ ద్వారా ఓట్లు లెక్కింపు సంబంధించి అభ్యర్థులకు వచ్చిన ఓట్లు వివరాలను రెండుసార్లుగా తెలియజేయడంతో పాటుగా కౌంటింగ్ కేంద్రంలో డిస్ప్లే బోర్డులో కూడా రౌండ్లు వారిగా ఓట్లు వివరాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఏజెంట్లకు కౌంటింగ్ సంబంధించి శిక్షణ ఇచ్చుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు కౌంటింగ్ ఏజెంట్లు కు సంబంధించి ఫారం 18 ను రెండు సెట్లును జూన్ 1న తహశీల్దార్ కార్యాలయంలో అందజేసిన ఎడల కౌంటింగ్ ఏజెంట్లకు ఐడి కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. 4న ఉదయం కౌంటింగ్ కేంద్రానికి వచ్చే కౌంటింగ్ ఏజెంట్లు ఫారం 18తో పాటుగా ఐడి కార్డును తప్పనిసరిగా తీసుకోరావాలన్నారు. సమావేశంలో రూరల్ తహశీల్దార్ షేక్ హసీనాబి, ఎస్ఓ సౌందర్యరాజన్, డిటి కిరణ్, ఎలక్షన్ డిటి హిమగిరి, టిడిపి బిఎన్.రాజసింహులు, వైఎస్ఆర్పిపి ఉదయ్ కుమార్, అఖిల భారత జన సంఘం పార్టీ తరపున రమణా రెడ్డి, ఇండిపెండెన్స్ రియాజ్ బాషా, పురుషోత్తం, ప్రభాకర్ రెడ్డి, మోహన్, విజయ కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలో బస్టాండ్లు, మార్కెట్లు, షాపింగ్ కాంప్లెక్సులు, ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను కమిషనర్ డాక్టర్ జె.అరుణ మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో నగరంలో మొదటి దశలో చేపడుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు కూరగాయల మార్కెట్లు, ఫిష్ మార్కెట్, స్లాటర్ హౌస్, షాపింగ్ కాంప్లెక్సులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్, రైతు బజార్లు, పూలమార్కెట్లు, ఇతర ప్రాంతాల్లో గ్యాంగ్ వర్కుల ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పనులను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న గ్యాంగ్ వర్క్‌లను పరిశీలించిన కమిషనర్ పాత బస్టాండ్, ఓల్డ్ మార్కెట్, ఏఎస్ఎం కాంప్లెక్స్, చేపల మార్కెట్, ఎంఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద స్థానిక దుకాణదారులు, వర్తకులతో మాట్లాడారు. వ్యర్థాలను ఇష్టానుసారం పడేయకుండా తడి, పొడిగా వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. షాపింగ్ కాంప్లెక్సులను శుభ్రంగా ఉంచాలన్నారు. మొదటిదశలో చేపడుతున్న ముందస్తు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పక్కాగా చేయాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల నిర్వహణ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం ఉండరాదన్నారు. గ్యాంగ్ వర్క్ లను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. పనులు చేస్తున్న కార్మికులతో మాట్లాడారు, గ్యాంగ్ వర్క్‌ల నిర్వహణపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. సానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు తనిఖీ చేస్తున్న నగర కమిషనర్ అరుణ

క్రైం న్యూస్

భారీగా ఎర్రచందనం స్వాధీనం

ఒకరు అరెస్ట్

స్వాధీనం చేసుకున్న ఎర్రచంనం దుంగలు నిందితుడ్ని చూపుతున్న డిఎఫ్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అటవీశాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో భారీ ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ను అదుపులోకి తీసుకున్నారు. డీఎఫ్ఓ చైతన్య కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమకు అందిన రహస్య సమాచారం మేరకు తిరుపతి–బెంగళూరు జాతీయ రహదారి నాంద్రగుంట వద్ద అటవీశాఖ అధికారులు గస్తీ నిర్వహిస్తున్న సమయంలో అటువైపుగా వస్తున్న వాహనాన్ని ఆపడంతో ఫారెస్ట్ అధికారులను గమనించి వాహనాన్ని ఆపకుండా వేగంతో పరారయ్యేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. కొద్ది దూరం వెంబడించి అటవీశాఖ అధికారులు వాహనాన్ని చుట్టుముట్టడంతో అందులో ఉన్న ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు పరారు కాగా తమిళనాడు రాష్ట్రం కుట్రపురై గ్రామానికి చెందిన గోవింద రాజన్ (21) పట్టుబడినట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రెండు కోట్ల 50 లక్షలు విలువ చేసే ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.అ లాగే ఓ వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. పట్టుబడ్డ నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు పారిపోయిన మరో ఇద్దరు వ్యక్తుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఎర్రచందనం దొంగలతో సహా నిందితులను పట్టుకోవడంలో ఎఫ్ఆర్ఓ థామస్ డిఆర్ఓ కిరణ్ సిబ్బంది ముఖ్యపాత్ర పోషించారని వారిని అభినందించారు. పట్టుబడ్డ నిందితుడు గోవింద రాజన్న రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

స్కూటర్‌ను ఢీకొన్న లారీ - వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో మంగళవారం సంతకు వస్తుండగా మార్గమధ్యలో లారీని ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మంగళవారం సంత సందర్భంగా మండలంలోని వేట్కూరు పల్లి దళితవాడకు చెందిన చిట్టిబాబు(48) గంగాధరనెల్లూరుకు బయలు దేరి వస్తుండగా జంగాలపల్లిలో నుండి లారీ మెయిన్ రోడ్లోకి రావడంతో స్కూటర్ ఢీకొట్టింది. దీంతో చిట్టిబాబు అక్కడికక్కడే మతి చెందారని స్థానికులు తెలిపారు. వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది గాయపడిన వ్యక్తిని పరిశీలించి అప్పటికే మతిచెందాడని ధ్రువీకరించారు. పోస్ట్ మార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: పాముకాటు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన బంగారుపాళ్యం మండలం కెజి.సత్రం గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఎస్.మునికష్ణ (56) అనే వ్యక్తి ఇంటి అరుగుపై నిద్రిస్తుండగా కట్లపాము అతని చెవిపై కాటు వేసింది. దీంతో అతను లేచి పామును చంపి కుటుంబ సభ్యులను నిద్రలేపి పాటు కాటుకు గురైన విషయం చెప్పాడు. వారు వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు వైద్యులు తెలిపారు.

అదుపు తప్పిన ద్విచక్రవాహనం

వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డి దాసర్లపల్లి జాతీయ రహదారిలో రామాపురం క్రాస్ వద్ద టిప్పర్‌ను తప్పించబోయి ద్విచక్ర వాహనదారుడు కిందపడటంతో రైతు గణేష్ తీవ్రంగా గాయాలపాలయ్యాడు. రామాపురం గ్రామానికి చెందిన గణేష్ సొంత పనుల నిమిత్తం దాసర్లపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా రామాపురం వద్ద టిప్పర్ అధిక వేగంతో రావడంతో టిప్పర్ తప్పించబోయి ప్రమాదానికి గురైనాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 ద్వారా బైరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కుప్పం పిఎస్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుం సభ్యులు తెలిపారు.

అలజడి సృష్టిస్తే కఠినచర్యలు : ఎస్సై

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కౌంటింగ్ రోజు గ్రామాలలో అలజడి సష్టిస్తే కఠినచర్యలు తప్పవు ఎస్ఆర్ పురం ఎస్సై రాజకుల్లాయప్ప హెచ్చరించారు. ఎస్సై మాట్లాడుతూ మండలంలో సమస్యాత్మక ప్రాంతాలైన పుల్లూరు, కొత్తపల్లి మిట్ట గ్రామాలలో ప్రతిరోజు గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ రోజున పోలీస్ సిబ్బంది మూడు బందాలుగా ఏర్పాటు చేసి ఎస్ఆర్ పురం, ముద్దికుప్పం, కొత్తపల్లి మిట్ట రూట్‌లో మొబైల్ వాహనాల ద్వారా గస్తీ నిర్వహిస్తామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు

పెద్దూరులో పోలీసుల కార్డెన్ సర్చ్

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని 89 పెద్దూరులో మంగళవారం ఎస్సై శివకుమార్ సిబ్బందితో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇటీవల వైసిపి, టిడిపి కార్యకర్తలు గొడవలు నేపథ్యంలో గ్రామవీధుల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో144 సెక్షన్ అమలులో ఉందని అల్లర్లు గొడవలకు పాల్పడ రాదని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రికార్డులు లేని మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 60 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నారు.

గంగమ్మకి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని వివి పురం గ్రామంలో వెలసిన శ్రీ ఆరిమాని గంగమ్మ తల్లికి మంగళవారం గంగ జాతర సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వెంకటా చలపతి ఆచార్యులు అమ్మవారికి పాలాభిషేకం, కుంకుమార్చన చేసి నైవేద్యం పెట్టి అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదం పంచిపెట్టారు.

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి గ్రామపంచాయతీ సొన్నేపల్లి గ్రామంలో శ్రీముత్యాలమ్మ గంగ జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రీముత్యాలమ్మ అమ్మవారికి బోయకొండ గంగమ్మకు, నల్లగంగమ్మ దేవుళ్లకు ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించి అభిషేకాలను నిర్వహించారు.

తవణంపల్లి: జోగివారిపల్లిలో వైభవంగా గంగమ్మ జాతర వేడుకలను ఆలయ చైర్మన్ నాగరాజు ప్రారంభించారు. మహిళలు అమ్మవారికి అంబళ్లు పోసి, పొంగళ్ళు పెట్టి మొక్కలు చెల్లించుకున్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలో గంగమ్మ జాతర వేడుకలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఇంటింటి నుంచి గ్రామవీధుల్లో వాయిద్యాలు నడుమ మహిళలు అంబళ్ళను తీసుకువచ్చి గంగమ్మ సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గరిగెతో గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త రామ స్వామిశేఖర్ మొదలి పాల్గొన్నారు.